అప్రమత్తంగా ఉండండి

- లోతట్టు ప్రజలను శిబిరాలకు తరలించండి
- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసం నుంచి సిఎం.. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరించాలని దిశానిర్దేశం చేశారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదమున్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది పరిశీలించాలని సూచించారు. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని సూచించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం చోటుచేసుకోకుండా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జిహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.


'హాసిత భాష్పాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్, పక్కన శ్రీరామ్, అందెశ్రీ

'హాసిత బాష్పాలు' పుస్తకావిష్కరణ

అద్దాల మేడలు, రంగుల గోడలు అభివృద్ధి కాదనీ, పేదవాడు తలెత్తుకుని తిరిగేలా పాలన సాగినప్పుడే నిజమైన అభివృద్ధి అని అంబేద్కర్ వ్యాఖ్యానించినట్టుగా తమ సర్కారు పేదల కోసం పనిచేస్తున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ కవి అందెశ్రీ రచించిన 'హాసిత భాష్పాలు' పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు తమపై పెద్ద బాధ్యత పెట్టారని చెప్పారు. నాలుగు కోట్ల మంది సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు. సిఎం పదవి తన చేతుల్లో ఉన్నంత కాలం ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. నాలుగున్నల లక్షల మందికి సొంతింటి కల నెరవేరుస్తున్నామని, మూడు కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి వచ్చిన ఆనందంలో ప్రజలున్నారని గుర్తు చేశారు. 2047 వరకు మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ తన లక్ష్యమని చెప్పారు. తెలంగాణ సమాజం కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ అని కొనియాడారు. ఉద్యమంలో ప్రజలకు ఎంతో మంది కవులు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న ఇలా అనేక మంది ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కొందరు నకిలీ ఉద్యమకారులు తామే ఉద్యమకారులమని చెప్పుకుంటూ తిరుగుతున్నారని విమర్శించారు. ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకు అన్ని వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో అన్నీ కోల్పోయారని అన్నారు. వారు అలా చెప్పుకొని తిరగడానికి కారణం.. నిజమైన ఉద్యమకారులు ఎవ్వరూ కూడా మేము ఉద్యమకారులం అని చెప్పుకోకవడమేనని తెలిపారు. నిజమైన ఉద్యమకారులంతా గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. రాజకీయాల్లో తాను ఎవరినీ శత్రువులుగా చూడననీ, అలా చూడాలన్నా వాళ్ళకి ఆ స్థాయి ఉండాలని తెలిపారు. శత్రువులకు నా గెలుపే అసలైన శిక్ష అని చెప్పారు. తనకు రాజకీయాల్లో శత్రువులెవరూ లేరన్నారు. వ్యక్తిగత పగకోసం తన పదవిని అడ్డం పెట్టుకుంటే తనకన్నా మూర్ఖుడు ఇంకొకరు ఉండరని అభిప్రాయపడ్డారు. తనకు అన్ని చట్ట సభల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, అందెశ్రీ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

సెప్టెంబర్ 21న ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల మహాగర్జన

- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ, ఉపాధ్యాయుల రిజర్వేషన్ ఫలాలను జీవో నెంబర్ రెండు ద్వారా ప్రభుత్వాలు లాక్కుంటున్నాయని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) విమర్శించాయి. వచ్చేనెల 21న ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ, ఉపాధ్యాయుల మహాగర్జన నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. శనివారం హైదరాబాద్‌లో టిజిటిటిఎఫ్ అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రామచందర్ (తెగ), ఎన్ యాదగిరి (బిటిఎఫ్), కొంగల వెంకట్ (ఎస్‌సి, ఎస్‌టియుఎస్), చైతన్య కల్పదర్శి (బిటిఎఫ్), బి.గోవింద్ నాయక్ (జిటిఎస్), ఎస్.హరికిషన్ (టిటిఎ), బాబూరావు (ఎస్‌సి, ఎస్‌టి డాక్టర్ అసోసియేషన్), మేడీ రమేష్ (ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ శాఖ), తులసీదాస్ గైక్వాడ్ (ఎస్‌సి, ఎస్‌టి సెక్రటేరియట్ యూనియన్), నరసింహ (ఆయుష్), బబిత కుమారి (పిటిఎ), తులసిరామ్ రాథోడ్ (టిబేస్), తిరుపతిరావు (పబ్లిక్ అండ్ హెల్త్ ఎస్‌సి, ఎస్‌టి యూనియన్), అనసూయ (ఎస్‌సి ఎస్‌టి హెల్త్ అండ్ స్టాఫ్ అసోసియేషన్). రోహిత్ (హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అడెక్వసి లెక్కింపులో తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శించారు. జనరల్ రోస్టర్‌లో ఉద్యోగం పొందిన ఎస్‌సి, ఎస్‌టిలను రిజర్వేషన్ కింద లెక్కించకూడదని కానీ జీవో నెంబర్ రెండు ద్వారా జనరల్ రోస్టర్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ, ఉపాధ్యాయులను రిజర్వేషన్ రోస్టర్‌లో లెక్కించి రెండు దశాబ్దాలుగా ఉద్యోగోన్నతులు రాకుండా ప్రభుత్వాలు మోసం చేస్తూ వస్తున్నాయని ఆరోపించారు.

మేడిగడ్డపై సిట్ విచారణ

- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద 2023, అక్టోబర్ 21న పెద్ద ఎత్తున బాంబులు పేలిన శబ్దాలు వచ్చాయని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆ శబ్దం సుమారు రెండు కిలోమీటర్ల వరకు వినిపించాయని అన్నారు. వెంటనే స్థానిక రవికాంత్ అనే ఇంజినీర్ మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. పోలీసులు 174/2023 కింద కేసు నమోదు చేశారని వివరించారు. కానీ ఇప్పటి వరకు తిరిగి ఆ కేసు గురించి పట్టించుకోలేదని చెప్పారు. ఇంజినీర్ ఇచ్చిన ఫిర్యాదులో అసాంఘిక శక్తులు బ్యారేజీని కూల్చడానికి కుట్రలు చేసినట్టుగా అనుమానం ఉందన్నారు. మేడిగడ్డపై సిట్ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆ కేసుపై పోలీసులు విచారణ జరపలేదన్నారు. రెండేండ్లుగా ఆ కేసు అలాగే పెండింగ్‌లోనే ఉందని చెప్పారు. రూ.లక్ష కోట్లతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల స్కాం జరగడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగితే పేలుడు శబ్దాలు ఎందుకు వస్తాయని ప్రభుత్వాన్ని అడిగారు. అవసరమైతే 174/2023 మహదేవ్‌పూర్ కేసు విచారణను సిబిఐ వంటి స్వతంత్ర విచారణ సంస్థకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డిలను విచారించి వారి కాల్ డేటా బయటకు తీయాలని కోరారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్, బిజెపిలు కలిసి కుట్ర చేసి మేడిగడ్డ బ్యారేజీని కూల్చే కుట్ర చేశాయని ఆరోపించారు.

గోల్డ్‌షాప్ చోరీ కేసులో మరో ఇద్దరు అరెస్టు

- ట్రాన్సిట్ వారెంట్ పద్ధతిన సూర్యాపేటకు తీసుకొచ్చిన పోలీసులు
- అర కిలో బంగారం సీజ్, 92,500 నగదు రికవరీ
- పరారీలో ఉన్న మరికొందరు నిందితులు : ఎస్‌పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట పట్టణంలో జరిగిన జ్యువెలరీ షాపులో భారీ దొంగతనం కేసు ఛేదనలో పోలీసులు పురోగతి సాధించారు. నెలరోజుల నుంచి మిస్టరీగా మారిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు 60 లక్షల రూపాయల విలువైన అరకిలో (554 గ్రాముల) బంగారు ఆభరణాలు, రూ.92,500లు నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ నరసింహ వివరాలు వెల్లడించారు. ఎంజి రోడ్‌లో ఉన్న సాయి సంతోషి జ్యువెల్లరీ షాపులో జులై 21వ తేదీ ఆదివారం రాత్రి దుండగులు గ్యాస్ కట్టర్‌తో గోడకు కన్నం చేసి 2.5 కిలోల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు సూర్యాపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వెంటనే పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

జులై 27న సూర్యాపేట పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఖమ్మం పట్టణానికి చెందిన మేకల యశోదను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆమె సహా మొత్తం ఏడుగురు ఈ దొంగతనంలో పాల్గొన్నారని తేలింది. అనంతరం బీహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లో, నేపాల్ సరిహద్దుల్లో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టి సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల జాడను కనుగొన్నాయి. ఈ క్రమంలో వెస్ట్ బెంగాల్ రాష్ట్రం దక్షిన్ దినాజ్‌పూర్ జిల్లా బైహార్ గ్రామానికి చెందిన మాలిక్ మొల్లను ఆగస్టు 11న అతని స్వగ్రామంలో అరెస్టు చేసి, 554 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.87,500 స్వాధీనం చేసుకున్నారు. బలుర్‌ఘట్ జిల్లా కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టి 7 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి పొంది, ట్రాన్సిట్ వారెంట్ ప్రకారం సూర్యాపేటకు తరలించారు. ఇదే కేసులో అమర్‌భట్‌ను ఖమ్మంలో అదుపులోకి తీసుకుని రూ.5వేలు స్వాధీనం చేసుకున్నారు. అమర్‌భట్ నిందితులకు ఖమ్మంలో ఆశ్రయం కల్పించడం, సూర్యాపేటలో రేకీ చేయడంలో సహకరించినట్టు విచారణలో వెల్లడైంది. సీసీ ఫుటేజ్, మొబైల్, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఈ దొంగతనం నేపాల్‌కు చెందిన ప్రకాశ్ అనిల్‌కుమార్, కడాక్ సింగ్ అలియాస్ కడాక్ ఆహులిహలియ, పురన్ ప్రసాద్ జోషి, వెస్ట్ బెంగాల్ మల్దా జిల్లాకు చెందిన జషిముద్దీన్, ఇప్పటికే అరెస్టయిన మాలిక్ మొల్ల, అమర్‌భట్, మేకల యశోద కలిసి చేసినట్టు తేలింది. ముందస్తుగా దుకాణం వెనుక భాగంలో రేకీ చేసి, గ్యాస్ కట్టర్‌తో బాత్‌రూమ్ గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించి బంగారం, నగదు అపహరించినట్టు విచారణలో బయటపడింది. అనంతరం కిరాయికి తీసుకున్న ఇంటికి వెళ్లి దొంగిలించిన సొత్తును ఐదు భాగాలుగా పంచుకుని, ఖర్చుల నిమిత్తం యశోదకు, అమర్‌భట్‌కు కొంత బంగారం, నగదు ఇచ్చినట్టు మాలిక్ మొల్ల ఒప్పుకున్నాడు. వారందరినీ శనివారం సూర్యాపేట కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు. పరారీలో ఉన్న ప్రకాష్ అనిల్ కుమార్, కడక్ సింగ్, పురన్ ప్రసాద్ జోషి, జషిముద్దీన్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కేసు పర్యవేక్షణలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సిసిఎస్ హరికృష్ణ, పెనపహాడ్ ఎస్ఐ గోపికృష్ణ, హెడ్‌కానిస్టేబుళ్లు కర్ణాకర్, కృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది పాలకీడు సైదులు, ఆనంద్, మల్లేష్, సతీష్, శివకృష్ణ, ప్రభాకర్ తదితరులు కృషి చేశారు. నిష్పక్షపాత దర్యాప్తుతో కేసులో కీలక పురోగతి సాధించిన బృందాలకు ఎస్‌పి నరసింహ రివార్డు ప్రకటించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ గోపికృష్ణ ఉన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

నిధులు, నియామకాలు పెంచాలి

- 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ ప్రకారం కేటాయించాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ ప్రకారం నిధులు, నియామకాలు పెంచాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మెదక్ పట్టణంలోని టిఎన్‌జిఒ భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు గతేడాది నుంచి సబ్బులు, నూనెలు, గ్లౌజ్‌లు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. అదనపు పనులు చేయిస్తున్నా.. దానికి అదనపు వేతనం మాత్రం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. 73వ షెడ్యూల్‌లో 68 రకాల జిఒలను సవరించడం లేదన్నారు. 15 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం 21, 22, 25 జిఒలను గెజిట్ చేయడంలేదని విమర్శించారు. దీంతో కార్మికులు పెద్దమొత్తంలో నష్టపోతున్నారని తెలిపారు. కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీ వేజ్ పేర్లతో నియామకాలు చేపడుతూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ ప్రకారం 68 రకాల జిఒలను సవరించి, కార్మికులకు నిధుల కేటాయింపు, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో డిసెంబర్ 7,8,9 తేదీల్లో రాష్ట్ర మహాసభ నిర్వహించనుండటంపై జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు రాష్ట్ర మహాసభలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించేందుకు మెదక్ జిల్లా వేదిక కాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, సిఐటియు రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.అడివయ్య, సిఐటియు మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి, ఎ.మల్లేశం, జిల్లా కోశాధికారి నర్సమ్మ, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, కార్మికులు పాల్గొన్నారు.


మీడియా ఎదుట నిందితుడిని ప్రవేశపెట్టిన పోలీసులు

కోదాడలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో మోసం

- ఆరుగురు అరెస్టు.. నగదు రికవరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


లబ్దిదారులకు చేరాల్సిన ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సిఎంఆర్‌ఎఫ్) చెక్కులను దారిమళ్లించిన ముఠాను సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. కోదాడ టౌన్ పోలీస్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, రూ.9.30 లక్షలు, ఐదు సెల్‌ఫోన్లు, ఆరు చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 44 చెక్కుల్లో 36 చెక్కుల ద్వారా రూ.13.63 లక్షలు నకిలీ లబ్దిదారుల ఖాతాల ద్వారా డ్రా చేసినట్టు ఎస్‌పి నరసింహ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ క్యాంప్ కార్యాలయంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పని చేసిన చెడపంగు నరేష్, ప్రయివేట్ పిఎలుగా ఉన్న మర్ల వీరబాబు, ఉప్పుల మధు కలిసి లబ్దిదారులకు జారీ చేసిన 44 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పక్కన పెట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే చెక్కులను రీవాలిడేషన్ చేయించి, అదే పేర్లతో ఉన్న ఇతరులను కనుగొని వారి ఖాతాల్లో జమ చేశారు. అనంతరం నకిలీ ఖాతాల ద్వారా డబ్బులు డ్రా చేసి, లబ్దిదారులకు చేరకముందే కాజేశారు. వారికి సురగాని రాంబాబు, గుంటుక సందీప్, రంగిశెట్టి వెంకట్రావు సహకరించారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి రూ.9.30 లక్షలు, ఐదు మొబైల్ ఫోన్లు, ఆరు చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ రూ.15.83 లక్షలుగా ఉండగా, అందులో రూ.13.63 లక్షలు ఇప్పటికే డ్రా చేశారు. చెడపంగు నరేష్ వద్ద రూ.1.40 లక్షలు, వీరబాబు వద్ద రూ.90 వేలు, ఉప్పుల మధు వద్ద రూ.2.50 లక్షలు, సురగాని రాంబాబు వద్ద రూ.2.50 లక్షలు, గుంటుక సందీప్ వద్ద రూ.2 లక్షలను పోలీసులు రికవరీ చేశారు. ఈ కేసు ఛేదనలో డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో కోదాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్, ఎస్ఐ హనుమనాయక్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, హరికృష్ణతో పాటు కానిస్టేబుళ్లు చాకచక్యంగా వ్యవహరించారని వారిని ఎస్‌పి అభినందించారు. వారికి రివార్డులు అందజేశారు.

టిబి నిర్మూలనలో ఆదర్శంగా నిలవాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిబి నిర్మూలనలో వికారాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతగిరి హిల్స్ హరిత రిసార్ట్స్‌లో శనివారం ట్యూబర్ క్యూలోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో "తెలంగాణ ట్యూబర్ క్యూలోసిస్, చెస్ట్ డిసిసెస్ కాన్ఫరెన్స్-2025" నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. టిబి నివారణకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. టిబి రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధి తగ్గడానికి చాలా రకాల మందులు వచ్చాయన్నారు. సబ్ కా వికాస్- సబ్ కా ప్రయాస్, టీబీ నిర్మూలనలో అందరూ కష్టపడితేనే.. అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి వికారాబాద్ జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చి దిద్దాలన్నారు. టిబి లక్షణాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. టిబి నిర్మూలనా చర్యలు తీసుకోవడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ మల్లికార్జున (మహబూబ్‌నగర్), డాక్టర్ రాజు (జోగులాంబ గద్వాల్), డాక్టర్ సుమలత (ఆదిలాబాద్), డాక్టర్ పుల్లారెడ్డికి ప్రశంసాపత్రాలు, గోల్డ్ మెడల్స్, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్, టిబి అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ సుదీర్ ప్రసాద్, దీనదయాళ్ బాగ్, డాక్టర్ నరేందర్, బాలచందర్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గవర్నర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్‌పి నారాయణరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): AT VISAKHAPATNAM
O.S.1909/2022

Between:
Kovvuri Srinvasa Reddy ...Plaintiff
And:
Samskruthi Infra Projects,
Rep., by its Managing Partner
Vysyaraju Srinivasa Raju & 4 others
...Defendants

SUMMONS

To
D-4:Sri Veeranagari Gautham Reddy
S/o. Narendra Reddy,
Partner of Jaagruthi Ventures,
R/at D.No. T1, Plot No.85A,
Road No.11, Film Nagar, Hyderabad,
Telangana-96

The above named plaintiff has filed the above suit for recovery of money basing on the sale agreement and for costs of the suit, etc., and the Hon'ble Court was pleased to order issuance of notice to you by way of substituted service of summons i.e., Paper publication as you have intentionally avoided service of notice. You are hereby summoned to appear before the above mentioned Court on **03-09-2022** at **10.30 A.M.** in person or through an advocate in the above case or else the matter will be heard and determined in your absence.


(By Order of the Hon'ble Court)
P. SUBBA REDDY,
Advocate
Viskakhapatnam,
Cell: 7386239666.

వర్షాల నేపథ్యంలో రైల్వే భద్రతా చర్యలు

- దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సమీక్ష
- ప్రధాన స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వర్షాల నేపథ్యంలో భద్రతా సన్నాహాలను దక్షిణ మధ్య రైల్వే ముమ్మరం చేసింది. ఈ క్రమంలో జోన్ వ్యాప్తంగా చేపట్టిన సమగ్ర చర్యలను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ శనివారం సికింద్రాబాద్ రైలు నిలయంలో సమీక్షించారు. భారీ వర్షాల వల్ల రైల్వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా నిరంతరాయంగా, సురక్షితంగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 24 గంటలూ విపత్తు నిర్వహణ కేంద్రాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అత్యవసర నిల్వలు (ఇసుక, సిమెంట్, రాళ్లు, పైపులు) సిద్ధంగా ఉంచడంపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. కీలక ప్రదేశాలపై నిరంతర తనిఖీలు చేయడంతో పాటు పెండింగ్ మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. స్టేషన్ యార్డులు, సున్నిత ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను తనిఖీ చేయడం, ప్రధాన స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం, ట్రాక్‌లు, ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్‌కు అడ్డంకిగా ఉన్న చెట్లను తొలగించడం, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు అప్రమత్తంగా ఉండాలని జిఎం ఆదేశించారు."రుతుపవనాల సంసిద్ధత కేవలం కాలానుగుణ ప్రోటోకాల్ కాదు.. ఇది ప్రయాణికుల భద్రత, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రతిబింబం. ప్రతి అధికారీ అత్యవసరంగా, కచ్చితత్వంతో వ్యవహరించాలి" అని జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. ఈ సమావేశంలో అదనపు జిఎం సత్యప్రకాష, ప్రధాన విభాగాధిపతులు, ఆరు డివిజన్లు విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ నుంచి డిఆర్‌ఎంలు, ఎడిఆర్‌ఎంలు, డివిజనల్ ఇంజినీర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సమీక్షకు ముందు జిఎం విపత్తు నిర్వహణ గదిని పరిశీలించారు. 24 గంటల కార్యాచరణ సంసిద్ధత, సున్నిత ప్రాంతాల ప్రత్యక్ష పర్యవేక్షణ, రాష్ట్ర అధికారులతో సమన్వయం వంటి అంశాలను ప్రాధాన్యతగా సూచించారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవాస్తవ



కలినరీ ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ లక్ష్యం

- సీకా ఉధ్యక్షులు సుధాకర్ ఎన్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్

కలినరీ ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే తమ లక్ష్యమని సౌత్ ఇండియా కలినరీ అసోసియేషన్ (సీకా) ఉపాధ్యక్షులు సుధాకర్ ఎన్.రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 19-21 వరకు చెన్నయ్‌లో అంతర్జాతీయ కలినరీ పోటీలు జరుగుతాయని తెలిపారు. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని, యువతను దానికి తగ్గట్టుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 200 మంది విద్యార్థులు, చెఫ్‌లు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ గెలుచుకున్న ముగ్గురు ప్రధాన చెఫ్‌లు 24 రకాల వంటకాలు, కేక్‌ల తయారీపై అవగాహన కల్పించారు. చెన్నయ్‌లో మూడు రోజుల పోటీల్లో 3,000 మంది పాకశాస్త్ర నిపుణులు పాల్గొంటారని అంచనా వేశారు.

టెండర్ల పేరుతో మత్స్యకారులకు మళ్లీ అన్యాయమే

- సొసైటీ అకౌంట్‌లో నగదు జమచేయాలి
- టిఎంకెఎంకెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెండర్ల పేరుతో మత్స్యకారులకు మరోసారి అన్యాయమే జరుగుతుందనీ, సొసైటీ అకౌంట్‌లో నగదు జమచేయాలని తెలంగాణ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం (టిఎంకెఎంకెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరెంకల నర్సింహా, లెల్లెల బాలకృష్ణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కోసం మత్స్య శాఖ ఫెడరేషన్ ద్వారా ఈ ఏడాది రూ. 122 కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఉచిత చేప, రొయ్య పిల్లలను టెండర్ల ద్వారా పంపిణీ కాకుండా ప్రతి సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ విధానాల మాదిరిగానే టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు ఇస్తే అవినీతికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పుడు మరో మార్గంలో దళారీ వ్యవస్థను తీసుకొస్తున్నారనీ, ఇది దొంగకు తాళం చేతులు ఇచ్చే విధంగా ఉందని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మత్స్య సొసైటీలకు జరిగిన పంపిణీలో కేవలం 30 శాతం మాత్రమే క్రింది స్థాయిలో గ్రౌండ్ అయిందనీ, 70 శాతం అవినీతి జరిగిందని గుర్తు చేశారు. ఆ విధానాన్ని విమర్శిస్తూనే పాత ఒరవడిలో కొనసాగడం మానుకోవాలని హితవు పలికారు.

In the Court of the Principal Senior Civil Judge : Nellore.
E.A.No. 51 / 2025
E.P.No. 146 / 2017
O.S.No. 405 / 2008

1. Shaik Masthan @ Padda Masthan (Died) (3rd JDR)
2. Shaik Karimunnisa Begum
3. Shaik Masthan
4. Shaik Anwar
5. Shaik Mohiddin
2 to 5 LRs of 3rd JDR
- Petitoners / Claim Ptitioners / LRs of 3rd JDR

Vs

1. Kotamreddy Janardhan Reddy (Died)
2. Kotamreddy Sobha
3. Kotamreddy Niranjan Reddy
4. Kotamreddy Giridhar Reddy
5. Shaik Babu Saheb
6. Shaik Kurshid - Respondents / DHRs
7. Shaik Masthanamma(Died)
- Respondents / JDRs

Notice to 5th Respondent

Shaik Babu Saheb, S/o Late **Meera Saheb,** Residing at Flat No.402, Srinath Residential Complex, Patney Centre, Secundrabad.

పై నెంబరు కేసులో క్లయిమ్ పిటిషనరు మీ మీద పై వారి కోర్టులో క్లయిమ్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే29-8-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

బందా శ్రీనివాసులు, B.A., L.L.B.,
క్లయిమ్ పిటిషనరు తరపు అడ్వకేటు, నెల్లూరు.

సోరెన్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. "ఆయన వారసత్వం, విలువలు, ఆదర్శాలు రాబోయే పోరాటాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి" అని కొనియాడారు. జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లా నెమ్రా గ్రామంలో శనివారం జరిగిన సంస్మరణ సభలో సీఎం రేవంత్ పాల్గొని సోరెన్‌కు నివాళులర్పించారు. ఆయన కుమారుడు హేమంత్ సోరెన్ పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రొ.ప్రకాశ్ గంటెల కన్నుమూత

- గుంటూరులో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



వెరిటస్ బైబిల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రొ.ప్రకాశ్ గంటెల శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతు న్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పరిస్థితి విషమించి మృతిచెందారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికదేహాన్ని శనివా రం మధ్యాహ్నం వరకు ముషీరాబాద్‌లోని మెన్నోనైట్ బ్రీతెర్న్ బేతేల్ చర్చ్‌లో ఉంచారు. జంట నగరాలకు చెందిన వేలాదిమంది క్రైస్తవ విశ్వాసులు ప్రకాష్ గంటెలకు నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్ధనల అనంతరం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అంబులెన్స్‌లో ప్రకాశ్ గంటెల భౌతికకాయాన్ని గుంటూరుకు తరలించారు. ఆదివారం మధ్మాహ్నం మూడు గంటల వరకు గుంటూరు లోని సెయింట్ మధ్యూస్ లూథరన్ వెస్ట్ పరిష్ చర్చిలో ఉంచి అనంతరం ఆనంద్‌పేట్ బరేల్ గ్రౌండ్‌లో అంత్యక్రియలు నిర్వహించను న్నారు. తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ సమాజానికి సుపరిచితులైన ప్రకాష్ గంటెల రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవ చేశారు.



ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే విద్యుత్ కనెక్షన్

- హైకోర్టు స్పష్టీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్ ఆఫీసర్లు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయకుండా బహుళ అంతస్తుల భవనాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దని హైకోర్టు తీర్పు వెలువరించింది. బిల్డర్లు ఆమోదించిన ప్లాన్‌లో పలు మార్పులు, చేర్పులు చేసి నిర్మాణాలు చేస్తున్న క్రమంలో ముందుగా విద్యుత్ కనెక్షన్ పొందడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కోర్టులో తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తామని హామీ ఇచ్చి అందుకు విరుద్ధంగా చేస్తున్నారని, ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు, అదనపు అంతస్తులను నిర్మిస్తున్నారంటూ తప్పుపట్టింది. కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తే ఊరుకోబోమని తెల్చి చెప్పింది. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. సమాజ హితం కోసం ఈ విధమైన ఉత్తర్వులు ఇస్తున్నట్టు వెల్లడించింది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఆ తరువాతే తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టిజిఎస్‌పిడిసిఎల్) విద్యుత్ కనెక్షన్‌ను చట్ట ప్రకారం పొందాలని తీర్పులో పేర్కొంది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తన భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఎన్‌ఒసి కోసం పట్టుబట్టకుండా టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మహమ్మద్ ఆరిఫ్ రిజ్వాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్టిల్ట్‌తో పాటు ఐదు అంతస్తుల నిర్మాణం జీహెచ్‌ఎంసీ మంజూరు చేసిన ప్రణాళిక ప్రకారమే జరిగిందన్నారు. అన్ని చార్జీలు చెల్లించిన తర్వాతే విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి కోరామని చెప్పారు. టిజిఎస్‌పిడిసిఎల్ తరపు న్యాయవాది శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతంలో ఓసీ సడలింపులకు అధికారులు అనుమతి ఇవ్వడంతో చాలా మంది లబ్దిదారులు ఆ తర్వాత కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు. విద్యుత్ కనెక్షన్ పొంది సరఫరాను అనుభవిస్తున్నారని.. దీంతో ఈ ఏడాది జనవరిలో టీజీఎస్‌పీడీసీఎల్ ఓ సర్క్యులర్ జారీ చేసిందన్నారు. 10 మీటర్ల ఎత్తు కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలకు విద్యుత్ సేవలకు ఓసీ తప్పనిసరి చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చాలా మంది బిల్డర్లు అనుమతి పొందిన దానికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. నిబంధనల మేరకు నిర్మాణం చేపడితే ముందుగా ఓసీ పొందాలని, ఆ ఆ తర్వాత విద్యుత్ కనెక్షన్ కోరవచ్చని స్పష్టం చేస్తూ, పిటిషన్‌పై విచారణను మగిస్తున్నట్టు ప్రకటించారు.

బిసి గురుకులాల్లో ఆర్‌సిఒల పెత్తనం!

- అనధికారిక పోస్టుతో కొందరి అడ్డగోలు దోపిడీ
- సీనియార్టీని విస్మరించి ప్రిన్సిపల్స్‌కు ప్రమోషన్
- అవుట్‌సోర్సింగ్ జాబ్‌ల విషయంలో ఏజెన్సీలతో కుమ్మక్కు
- ఒక్కో తాత్కాలిక ఉద్యోగానికి రూ.50 వేల నుంచి లక్ష వసూలు
- పట్టించుకోని సెక్రటరీలు
- ప్రాంతీయ కో-ఆర్డినేటర్ల ఇష్టారాజ్యం



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసి గురుకులాల్లో ప్రాంతీయ సమన్వయ అధికారులు (ఆర్‌సిఒలు) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సీనియార్టీని విస్మరించి ఆ జిల్లాల పరిధిలో నచ్చిన వారిని ఆర్‌సిఒలుగా సెక్రటరీలు నియమిస్తున్నారు. అనధికారిక ఆర్‌సిఒ పోస్టులో రిక్రూట్ అయిన ఆ రీజియన్ పరిధిలోని ప్రిన్సిపల్స్ అడ్డగోలుగా వ్యవహరిస్తున్న విమర్శలున్నాయి. మొదట్లో కాస్త నిజాయితీగా ఉన్నా నిలదొక్కుకోవటమే ఆలస్యం అక్రమార్జనకు దిగుతున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా తాత్కాలిక ప్రాతిపదికన నియమించే అవుట్‌సోర్సింగ్ పోస్టుల విషయంలో ఒక్కో పోస్టుకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్టు పెద్దఎత్తున ఆరోపణలున్నాయి. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలతో కుమ్మక్కై ఈ దందా నడుపుతున్నారు. రూ.రెండు లక్షలు ఏజెన్సీకి ఇవ్వాల్సిన పోస్టుపై రూ.50వేల నుంచి రూ.లక్ష అదనంగా వసూలు చేసి తమకు ఇస్తేనే జాబ్‌లో జాయినింగ్ అని ఏజెన్సీ నిర్వాహకులతో తెగేసి చెబుతున్నారు. ఈ మేరకు ముట్టచెప్పిన వారికే పోస్టు కేటాయిస్తున్నారనే చర్చ బీసీ గురుకుల ఉద్యోగవర్గాల్లో గుప్పుమంటోంది.

అనధికారిక పోస్టైనా అడ్డగోలు దోపిడీ

మొదట్లో సెక్రటరీలే పర్యవేక్షణంతా సాగించేవారు. ఎప్పుడైతే ఆర్‌సిఒల నియామకం జరిగిందో అడ్మిషన్లు మొదలు జాబ్‌ల వరకు ప్రతి దానికీ కొందరు ప్రాంతీయ సమన్వయ అధికారులు పైసలతోనే ముడిపెడుతున్నారు. ఒకప్పుడు అడ్మిషన్ రావాలంటే సెక్రటరీల ద్వారానే జరిగేది. ఒకవేళ ఎవరికైనా అడ్మిషన్ ఇవ్వాల్సి వస్తే సెక్రటరీ నుంచి స్కూల్ మెయిల్‌కు సంబంధిత వివరాలు పోస్టు చేసేవారు. స్కూల్/ కళాశాలలో అన్నీ పరిశీలించి ఆ విద్యార్థి అడ్మిషన్‌కు అర్హుడా? కాదా? నిర్ధారించేవారు. కానీ ఇప్పుడు అడ్మిషన్స్ విషయంలోనూ ఆర్‌సిఒల దందా సాగుతోంది. ఒక్కో అడ్మిషన్‌కు రూ.5వేల నుంచి రూ.10వేలకు పైగా డిమాండ్ చేస్తున్నట్టు విమర్శలున్నాయి. వాస్తవానికి బిసి గురుకులాల్లో తప్ప ఎక్కడా ఆర్‌సిఒ పోస్టులు లేవు. అదీ అనధికారికమే. కాబట్టి ఉన్నన్ని రోజులు సంపాదించుకోవాలనే ధ్యాసతో కొందరు ఆర్‌సిఒలు అక్రమార్జనకు దిగుతున్నారనే చర్చ ఉద్యోగ వర్గాల్లో ఉంది. సాంఘిక సంక్షేమ శాఖలో ఆర్‌సిఒల బదులు జోనల్ ఆఫీసర్స్, మైనార్టీ శాఖలో ఆర్‌ఎల్‌సీలు, గిరిజన సంక్షేమ శాఖలో ఆర్‌సిఒ పోస్టు ఉన్నా ఇవి రెగ్యులర్‌తోపాటు అధికారిక (ఓచర్) పోస్టులే కావటం గమనార్హం. ఈ రెండు డిపార్ట్‌మెంట్లలోనూ సీనియార్టీ ప్రాతిపదికన నియామకం చేపడుతున్నారు. బిసి గురుకులాల్లో పోస్టు అనధికారికమే అయినా గ్రేడ్-1 ప్రిన్సిపల్స్‌ను సీనియార్టీ ప్రకారం ఆర్‌సిఒలుగా నియమించాలి. కానీ సెక్రటరీలు నచ్చిన వారిని ఎంపిక చేస్తుండటం వివాదాస్పదం అవుతోంది. అవినీతి ఆరోపణలున్న ప్రిన్సిపాల్స్‌ను సైతం ఆర్‌సిఒలుగా నియమిస్తుండటాన్ని ఉద్యోగవర్గాలు ఆక్షేపిస్తున్నాయి. ఓ స్కూల్ ప్రిన్సిపల్‌పై అవినీతి ఆరోపణలున్నట్టు ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. అయినా, మరుసటి రోజే ఆ ప్రిన్సిపల్‌కు ఆర్‌సిఒగా ప్రమోషన్ ఇవ్వటం అప్పట్లో చర్చనీయాంశమైంది.

సెక్రటరీలకు తెలిసే జరుగుతుందా?

కొందరు ఆర్‌సిఒలు ఇష్టారీతిన అవినీతికి పాల్పడుతున్నా సెక్రటరీలు పట్టించుకోకపోవడంతో వారికి తెలిసే జరుగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురుకులాల్లో సమస్యలను పట్టించుకోకపోవటం, టైం టేబుల్ మార్చకపోవడం, ఆర్‌సిఒలపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఎలాంటి ఫిర్యాదు చేసినా సెక్రటరీలు పట్టనట్టే ఉండటంతో పలు సందేహాలు తలెత్తుతున్నాయి. ఆర్‌సిఒల దందా వ్యవహారాలు బిసి వెల్ఫేర్ సొసైటీకి, సెక్రటరీకి చేరుతున్నాయా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా ఉందని ఉద్యోగుల మాట.

పోస్టులు ఎలా నింపుతున్నారు?

అవుట్ సోర్సింగ్ పోస్టులు ఎలా నింపుతున్నారు? మీడియా నోటిఫికేషన్ ఏమైనా ఇస్తున్నారా? ఈ ఏడాదిలో ఎక్కడైనా పోస్టు నింపుతున్నట్టు నోటిఫికేషన్ వచ్చిందా? ఇలాంటివేవీ లేకుండానే రిక్రూట్‌మెంట్‌లు చేస్తున్నట్టు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ సెక్రటరీలు నిర్వహించేవారు. ఆ సమయంలోనే అవకతవకలు తక్కువగా ఉండేవని, కొందరు సెక్రటరీలకు ఏ స్కూల్‌లో ఏ సమస్య ఉందో.. ఏ టీచర్ ఏ సబ్జెక్ట్ బోధిస్తున్నారో కూడా సూక్ష్మస్థాయి పర్యవేక్షణ ఉండేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆర్‌సిఒలను కాదని నేరుగా సెక్రటరీల దృష్టికి ఏ సమస్య తీసుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారనే వాదన ఉంది.

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి పెద్దఎత్తున వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటమట్టం గంటగంటకు పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 20 అడుగుల్లో ఉన్న గోదావరి శనివారం రాత్రి 11గంటల సమయంలో 31 అడుగుల్లో ప్రవహిస్తోంది. వరద ప్రవాహం ఇదేవిధంగా కొనసాగితే సోమవారం మొదటి ప్రమాద హెచ్చరిక (43అడుగులు) జారీచేసే అవకాశం ఉంటుంది. వరద ఉధృతిని అంచనావేసిన అధికారులు నదిలో స్నానాలు ఆచరించే భక్తులు నది లోపలికి వెళ్లకుండా ఒడ్డునే ఉండి స్థానాలు ఆచరించాలని ఆదేశాలు జారీ చేశారు. నది వద్ద లాంచీలు, పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

టిఎవైఎల్ టికెట్ ధర తగ్గించిన ఆర్‌టిసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా గ్రేటర్ హైదరాబాద్ ప్రయాణికులకు టిజిఎస్ ఆర్‌టిసి ఆఫర్ ప్రకటించింది. ట్రావెల్ యాజ్ యూ లైక్ (టిఎవైఎల్) టికెట్ ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. మెట్రో డీలక్స్ బస్సులతో పాటు, సిటీ ఆర్డీనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ఈ టికెట్లను కొనుగోలు చేసే సౌకర్యం కల్పించారు. పెద్దలకు ఇంతకు ముందు ఉన్న టికెట్ ధర రూ.150ను సవరించి రూ.130 చేశారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంతకుముందు రూ.120 ఉండగా, దాన్ని సవరించి రూ.110 చేశారు. పిల్లలకు ఇంతకు ముందు ఉన్న టికెట్ ధర రూ.100ను సవరించి రూ.90 చేశారు.

జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే దేశం అభివృద్ధి

- అసమానతలు పోకుండా ఎదగలేం
- ఎస్‌వికె వెబినార్‌లో ఆర్థిక రంగ విశ్లేషకులు పాపారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో తలసరి జిడిపి పెరగకుండా అభివృద్ధి చెందిన దేశంగా ఎదగలేమని సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ ఆర్థిక రంగ విశ్లేషకులు పాపారావు వ్యాఖ్యానించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు కాకుండా ఏ దేశం కూడా అభివృద్ధి చెందినట్టు కాదని అభిప్రాయపడ్డారు. పాలకులు దేశ ప్రజల మధ్య అసమానతలు రూపమాపకుండా ఫలితాలు రావని చెప్పారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'టాప్-3లోకి భారత్ నిజంగానే వెళ్లనుందా ?' అనే అంశంపై జరిగిన వెబినార్‌లో మాట్లాడారు. దీనికి ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ... వృద్ధాప్యం నేపథ్యంలో వెనుబడ్డ జపాన్‌తో పోటీపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఆ దేశం జీడీపీలో వెనుకబడిన అంశాన్ని గుర్తు చేశారు. 2024లోనే జపాన్‌ను అధిగమించామని అన్నారు. ఆర్‌బిఐ మాజీ గవర్నర్ ఈ విషయమై స్పందిస్తూ 'గుడ్డివాళ్ల రాజ్యం..ఒంటి కన్ను రాజు' అనే సామెతను గుర్తు చేశారన్నారు. మన దేశంలో యువత ఎక్కువని గుర్తు చేశారు. అపారమైన మానవ వనరులను వినియోగించుకోవాలని సూచించారు. గొప్పలు తగ్గించి పనిమీద దృష్టిపెట్టాలని భారత సర్కారుకు హితవు పలికారు. మన దేశం చైనాతో పోటీపడాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో యువత అమెరికా వెళ్లడానికి ఆసక్తిగా లేరని అన్నారు. అమెరికా విధించిన 50 శాతం పన్నులు సైతం నిరుద్యోగాన్ని పెంచుతుందన్నారు.కనీస వేతనాలు పెరగకపోయినా, కొనుగోళ్లు నెమ్మదిస్తాయని చెప్పారు. దీంతో ఆర్థిక వ్యవస్థపై భారీ ప్రభావమే ఉంటుందన్నారు.

బిజెపి స్వదేశీ, హిందూత్వాలను నమ్ముతుందన్నారు. స్వదేశీలోనూ స్పష్టత లేదన్నారు. హిందూత్వ మూలంగా సమాజం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజల మధ్య మతం చిచ్చుపెట్టి విభజన చేస్తుందన్నారు. ప్రస్తుతం అమెరికా పరిస్థితి 'మా ఇంటికొస్తే ఏం తెస్తావు..మీ ఇంటికొస్తే ఏం ఇస్తావు' అనే పద్ధతిలో నడుస్తున్నదన్నారు. మెడికల్, ఆహార రంగాల్లోవ్యాపారం పడిపోతున్నదని వివరించారు. దీంతో లక్షలాది మంది జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని చెప్పారు. స్వదేశీ జపం చేస్తూ, విదేశీ ఎజేండా అమలుచేయడాన్ని తప్పుబట్టారు.

మూడు రోజులు విస్తారంగా వర్షాలు

- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతంలో కొనసాగిన అల్పపీడనం ఆదివారం నాటికి దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలకు విస్తరించిందనీ, పశ్చిమ, వాయువ్య దిశలో కదిలి క్రమేపీ బలహీనపడుతూ ఈనెల 18 నాటికి గుజరాత్ ప్రాంతానికి ఉపరితల ఆవర్తనంగా చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. అన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 395 ప్రాంతాల్లో వర్షపాతం నమోదయింది. 17 ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షం కురిసింది. అదిలాబాద్ జిల్లా తాంసీలో అత్యధికంగా 17.3 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. తలమడుగులో 17, మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో 14, నెన్నెలలో 10.2 వర్షం కురిసిందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా పంచాయతీ రాజ్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసింది.

'యూరియా' తిప్పలు

- ఉదయం నుంచే లైన్‌లో రైతులు
- మండల కేంద్రాల్లో ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదును దాటిపోతున్నా సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడం.. వచ్చినా కొద్దిమందికే అందుతుండటం.. అధికారులు నో స్టాక్ బోర్డులు పెట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోడ్ వచ్చిందని తెలిసిన వెంటనే తెల్లవారేసరికే ఆయా కార్యాలయాల ఎదుట లైన్‌లో నిలుచుంటున్నారు. కొన్ని చోట్ల శనివారం ధర్నాలు చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉదయం నుంచి గ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు లైన్‌లో నిలబడ్డారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కోసం రైతులు పలుచోట్ల రోడ్డుపై బైటాయించి ధర్నాలు చేశారు. రైతుల రాస్తారోకోతో గజ్వేల్ నుంచి తూప్రాన్, సంగారెడ్డి, రామాయంపేట వెళ్లే బస్సులు, వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సీఐ రవికుమార్ రంగంలో దిగి రైతులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమించాలని కోరారు. వ్యవసాయ అధికారులు సంఘాల స్థలానికి చేరుకొని యూరియా రాగానే పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ రాజీవ్ రహదారిపై రైతులు మహాధర్నా నిర్వహించారు. వారికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం గజ్వేల్‌లో రైల్వే రేక్ పాయింట్ పునరుద్ధరించి రైతులకు యూరియా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రైతులు పాసు బుక్కులతో యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వద్ద లైన్‌లో నిలబడ్డారన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యూరియా కోసం రైతులు చేగుంట మండల కేంద్రంలో శ్రీ ఆంజనేయ రైతు సేవ కేంద్రం వద్ద లైన్ కట్టారు. రైతు సేవ కేంద్రానికి 200 బస్తాల యూరియా రావడంతో దాదాపు 400 మంది రైతులు ఉదయం నుంచే లైన్‌లో ఉన్నారు.

ఖజానా జ్యువెల్లరీలో చోరీ నిందితుల అరెస్ట్

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ డిసిపి వినీత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చందానగర్‌లోని ఖజానా జ్యువెల్లరీలో దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డిసిపి కార్యాలయంలో డిసిపి వినీత్ శనివారం మీడియాకు వెల్లడించారు. బీహార్‌కు చెందిన దోపిడీదారులు హైదరాబాద్‌లోని బంగారం, వజ్రాల ఆభరణాల దుకాణాలను తుపాకీలతో దోచుకోవాలని ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లో వెల్డింగ్ కార్మికుడైన వారి సహచరుడు దీపక్‌కుమార్ సాహూ సహాయంతో జులైలో జీడిమెట్లలోని అస్బె స్టాస్ కాలనీలో ఒక ఇల్లును అద్దెకి తీసుకున్నారు. రెండు సెకండ్‌హ్యాండ్ బైకులను కొనుగోలు చేశారు. కొన్ని రోజులుగా చందానగర్‌లోని షోరూంలను పరిశీలించారు. చివరకు ఖజానా జ్యువెలరీని ఎంచుకొని దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలో ఆశిష్ కుమార్‌సింగ్‌ను అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు వీరికి వాహనాలను ఏర్పాటు చేసిన దీపక్‌కుమార్ సాహూను కూడా అరెస్టు చేశారు. వీరి నుంచి దాదాపు 900 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా ఏడు మంది దోపిడీకి పాల్పడినట్టు తెలిపారు. వీరిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో యుఎస్/11 (2), 115(2), 127(2), 324(3), 310(2), 351(3) బిఎన్ఆర్ ఆర్/డబ్ల్యూ సెక్షన్ 25(1-బి), 27(1) ఆయుధ చట్టంలో 890/ 2025లో కేసు నమోదు చేశారు. అభరణాల దుకాణాల నిర్వహణ సంస్థలు పనివేళలో తగిన భద్రతా యంత్రాంగాన్ని కలిగి ఉండాలని డిసిపి సూచించారు. దుకాణాల వద్ద చొరబాటు అల్లారం పానెల్‌ను కలిగి ఉండాలని తెలిపారు. ఎస్‌ఒటి, సిసిఎస్, ఎల్ అండ్‌ఓ సిబ్బంది సమిష్టి కృషితో దొంగలను అరెస్టు చేసినట్టు వివరించారు. మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిసిపి

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- మంత్రులు తుమ్మల, పొన్నం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు తగిన విధంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నేతలతో మంత్రులు శనివారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పని చేయాలని, అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బూత్ కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బూత్‌ల వారీగా డివిజన్‌లో ఉన్న 46 బూత్‌ల పరిధిలో సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే అది రాష్ట్ర అభివృద్ధికి సంకేతం అవుతుందన్నారు. తామంతా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు వెల్లడించారు.

ప్రమాదానికి గురైన కారులో గంజాయి

ప్రజాశక్తి - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదానికి గురైన కారులో 16 కేజీల గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మహబూబాబాద్‌కు చెందిన భూక్యా నాయక్ ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా ప్రమాదం జరిగినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు భూక్యా నాయక్‌తో పాటు సెల్‌ఫోన్, 16 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్

మాదాపూర్‌లో ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. మాదాపూర్ ఇమేజ్ గార్డెన్ రోడ్డులో అర్ణవ్ ప్లాజాలో ఉన్న ఎస్‌పీపీ ఎగ్జిక్యూటివ్ ఉమెన్స్ హాస్టల్‌లో 16 ఏళ్ల బాలిక ఉంటోంది. బాలికపై హాస్టల్ నిర్వాహకుడు సత్య ప్రకాష్ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ కొందరు మహిళలు ఆందోళనకు దిగారు. పూలకుండీలను ధ్వంసం చేసిన మహిళలు, సత్యప్రకాష్‌పై దాడికి దిగారు. హాస్టల్‌లో గొడవ జరుగుతోందని డయల్ 100కు సమాచారం రావడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితి అదుపు చేశారు. దాడికి పాల్పడిన మహిళలతో పాటు, సత్య ప్రకాష్‌ను మాదాపూర్ పీఎస్‌కు తరలించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరగలేదని, కావాలనే పథకం ప్రకారం తనపై దాడి చేశారని సత్య ప్రకాష్ ఆరోపించారు.

జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వే

- నియోజకవర్గంలో 'ఇంటెలిజెన్స్' ఫీట్లు
- స్థానికులకే టికెట్ !?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాగంటి గోపినాథ్ మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంపై కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నది. సీటు నాకు కావాలంటే నాకు కావాలని నేతలు పోటీ పడుతున్న తరుణంలో ఆసలు ఆ నియోజవర్గంలో పార్టీ ప్రస్తుత పరిస్థితి ఏంటో అంచనా వేసుకోవాలని భావించింది. ఈ తరుణంలో సర్కారీ ఇంటెలిజెన్స్‌కు పనిజెప్పింది. జూబ్లీహిల్స్‌లో తాజా పరిస్థితి, టికెట్ ఎవరికి ఇస్తే విజేత అవుతారో అంచనా వేసేందుకు సర్వేకు శ్రీకారం చుట్టింది. క్రికెటర్ అజారుద్దీన్‌తోపాటు గత ఎన్నికల్లో నాంపల్లి నుంచి పోటీచేసి ఓడిన ఫిరోజ్‌ఖాన్ సైతం టికెట్‌ను ఆశిస్తున్నారు. వీరేకాకుండా స్థానిక కార్పొరేటర్ ఒకరు, ఇంకో ప్రముఖ్య వ్యక్తి సైతం బరిలో దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఒకానొక సందర్భంలో ప్రముఖ సినీతారలు చిరంజీవి, నాగార్జున పేర్లు కూడా వినిపించాయి. అదంతా ఊహాజనిత ప్రచారంగా గాంధీభవన్ వర్గాలు కొట్టిపారేశాయి. ఇదిలావుండగానే హైదరాబాద్ ఇన్‌చార్జిగా ఉన్న రవాణా శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ సంచలన ప్రకటన చేశారు. స్థానిక నేతలకే జూబ్లీహిల్స్ టికెట్ ఇస్తామని వ్యాఖ్యానించారు. దింతో కాంగ్రెస్‌లో భిన్నమైన అభిప్రాయాలు ముందుకొచ్చాయి. ఇందుకు ఫిరోజ్‌ఖాన్ స్పందిస్తూ 'పొన్నం ప్రభాకర్ ఇన్‌ఛార్జి మంత్రి మాత్రమే, కాంగ్రెస్ అధిష్టానం కాదు..టికెట్ కేటాయించే ముందు సర్వే చేస్తారు..ఇతర ప్రక్రియ కూడా ఉంటుందని' అభిప్రాయపడ్డారు. అయితే పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యల వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారంటూ గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పొన్నం చేత పనిగట్టుకుని సిఎం ఆ తరహా వ్యాఖ్యలు చేయించారనే ప్రచారమూ ఉంది. ఇలా చేయడం మూలానా ఇటు అజారుద్దీన్‌కు గానీ, అటు ఫిరోజ్‌ఖాన్‌గాని టికెట్ ఇచ్చే ఉద్దేశం లేదని చెప్పడమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటెలిజెన్స్ సర్వేలో స్థానిక నేతలకే మార్కులు పడ్డాయని తెలిసింది. ప్రధానంగా నవీన్‌యాధవ్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్టు సమాచారం. అలాగే స్థానిక కార్పొరేటర్‌తోపాటు పిజెఆర్ కూతురు విజయారెడ్డి సైతం పోటీపడుతున్నట్టు తెలిసింది. కాగా గత ఎన్నికల్లో పోటీచేసిన అజారుద్దీన్ టికెట్ కోసం శ్రమిస్తున్నారు. నియోజకవర్గాన్ని కలియతిరుగుతూ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వార్డుల వారీగా ఆరా తీసినప్పుడు స్థానిక నాయకులకే అత్యధిక ఓట్లు వచ్చినట్టు సమాచారం. అయితే అజారుద్దీన్ ఢిల్లీస్థాయిలో పైరవీ చేస్తున్నారు. ఫిరోజ్‌ఖాన్ సిఎం ప్రాపకం కోసం తాపత్రయపడుతున్నట్టు సమాచారం. ఇప్పుడు ఈ నియోజకవర్గం అభ్యర్థిని నిర్ణయించడంలో సిఎం రేవంత్‌తోపాటు ఎఐసిసి వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కీలకపాత్ర పోషించనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

సర్కారు బడులను సెమీ గురుకులాలుగా మార్చాలి

- డిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలనూ సెమీ గురుకులాలుగా మార్చాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం 15వ వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం పౌష్టికాహారం, సాయంత్రం స్నాక్స్, పాలు ఇవ్వాలని కోరారు. పాఠశాలలోనే హోంవర్క్ చేయించిన తర్వాతే విద్యార్థులను ఇంటికి పంపే విధానం చేపట్టాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించే అవకాశముందన్నారు. గత ప్రభుత్వం కులాల వారీగా, మతాలవారీగా, ప్రస్తుత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు సరికాదని అన్నారు. ఈ చర్యల ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అంతరాలను పెంచే వివిధ రకాల పాఠశాలలను కాకుండా అందరూ విద్యార్థులు కలిసి చదువుకునే ఒకే రకమైన పాఠశాలలు ఏర్పాటు చేసి సమాన అవకాశాలు గల నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఐదు డిఎలను విడుదల చేయాలని, 2023, జులై ఒకటి నుంచి పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని చెప్పారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని అన్నారు. కోర్టు కేసులను అధిగమించి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. కెజిబివి ఉపాధ్యాయులు, ఇతర ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలనీ, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, గురుకుల, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.